సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
శనివారం । 1 । మార్చి । 2025





**తుది నిర్ణయం సీఎస్‌దే..**

2010లో కేయూలో వివిధ విభాగాల్లో నియామకమైన అసిస్టెంట్ ప్రొఫెసర్ల అంశంపై సీఎస్‌దే తుదినిర్ణయం కానుంది. - 8లో



**సమాజహిత పరిశోధనలు..**

సమాజహిత పరిశోధనలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని కేయూ వీసీ ఆచార్య ప్రతాప్‌రెడ్డి అన్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
35.1°/21.2°

**వాతావరణం**

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు కాస్త ఉక్కపోతగా ఉంటుంది. రాత్రివేళ కాస్త చలిగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### నేడు భూపాలపల్లిలో రైతుల సమావేశం

కాళేశ్వరం: జాతీయ రహదారి 353(సీ)లో మహదేవపూర్ మండలం కాళేశ్వరం శివారులోని పంట భూములు కోల్పోతున్న రైతులతో భూపాలపల్లి ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓతో శనివారం సమావేశం నిర్వహిస్తున్నారు. సుమారుగా మొత్తం 11ఎకరాల వరకు భూములను పలువురు రైతులు కోల్పోతున్నారు. పది రోజుల కిందటనే భూముల ఎంజాయ్‌మెంట్ సర్వే చేపట్టిన విషయం తెలిసిందే. రైతులతో చర్చించి భూములకు ఎంత ధర చెల్లించనున్నారో తెలుపనున్నట్లు తెలిసింది.

### ప్రతాపగిరి అడవిలోకి పులి

కాటారం: ప్రతాపగిరి అడవుల్లోకి పులి ప్రవేశించినట్లు అటవీశాఖ అధికారులు శుక్రవారం గుర్తించారు. వారం రోజుల క్రితం నస్తూర్‌పల్లి వైపుగా వచ్చిన పులి ప్రతాపగిరి మీదుగా మహదేవపూర్ మండలం రాపెల్లికోట అడవుల్లోకి వెళ్లినట్లు ప్రచారం జరిగింది. అప్పటి నుంచి పులికి సంబంధించి ఆనవాళ్లు తెలియరాలేదు. తాజాగా ప్రతాపగిరి అటవీ ప్రాంతంలో గాలిస్తున్న అటవీశాఖ అధికారులకు పులి పాదముద్రలు (ఫ్లగ్ మార్క్స్) కనిపించాయి. దీంతో పులి తిరిగి ఇటు వైపుగానే వచ్చినట్లు అంచనా వేస్తున్నారు. పులి ప్రతాపగిరి అటవీ ప్రాంతం నుంచి గతంలో వచ్చిన దారిలోనే నస్తూర్‌పల్లి అటవీ ప్రాంతంలోకి చేరుకునే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. రైతులు, కాపర్లు రాత్రి పూట అటవీ ప్రాంతాల్లోకి వెళ్లవద్దని అప్రమత్తంగా ఉండాలని వారు తెలుపుతున్నారు.

### విద్యార్థులతో పనులు..

కాటారం: గంగారం మోడల్ పాఠశాల పదో తరగతి విద్యార్థులు పాఠశాలకు సంబంధించిన పనులు చేసిన విషయం వివాదాస్పదంగా మారుతోంది. విద్యార్థులు బియ్యం బస్తాలు ఎత్తడం పలు విమర్శలకు దారి తీసింది. మోడల్ పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బియ్యం బస్తాలు శుక్రవారం ఆటో ట్రాలీలో వచ్చాయి. ఆటోలో నుంచి వాటిని తీసి పాఠశాలలో వేయడానికి ఒక వ్యక్తి మాత్రమే ఉండటంతో బ్రేక్ టైంలో అటు వైపుగా వచ్చిన పదో తరగతి విద్యార్థులను సాయం కోరాడు. దీంతో ఇద్దరు విద్యార్థులు ఆటో లోపలికి ఎక్కి బస్తాలను సదరు వ్యక్తికి ఎత్తారు. అటు వైపుగా వెళ్లిన పలువురు వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో వైరల్ అయి కలెక్టర్ దృష్టికి వెళ్లింది. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ నాగరాజు పాఠశాలకు వెళ్లి ఘటనపై ఆరా తీసి వివరాలు నమోదు చేసుకున్నారు. పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో ఇలా విద్యార్థులతో పని చేయించడం ఏంటని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపాల్ గోవర్ధన్‌ను సాక్షి వివరణ కోరగా పరీక్షలకు సంబంధించి సమావేశం ఉండటంతో తాను కలెక్టర్ కార్యాలయానికి వెళ్లినట్లు తెలిపారు. విద్యార్థులు బ్రేక్ టైంలో అటు వైపు వెళ్లగా సహాయం కోరడంతో చేశారే తప్ప తమ ఉపాధ్యాయులు పని చేయమని చెప్పలేదని.. పలువురు రాద్ధాంతం చేయాలని చూస్తున్నారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

### వైభవంగా అగ్నిగుండ మహోత్సవం



వెంకటాపురం(ఎం): రామప్పలో శుక్రవారం తెల్లవారుజామున నిర్వహించిన అగ్నిగుండాల మహోత్సవం ఆలయ అర్చకులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ వైభవంగా నిర్వహించారు. ఆలయానికి ఉత్తరం వైపుగల గార్డెన్‌లో ఈ మహోత్సవం నిర్వహించగా సుమారు రెండువేల మంది భక్తులు హాజరై అగ్నిగుండాలను తిలకించారు. 106 మంది భక్తులు అగ్నిగుండంలో నడిచి తమ భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. అగ్నిగుండాలకు చెందిన విభూదిని నుదుట (బూడిద) ధరిస్తే తాము కోరుకున్న కోరికలు నెరవేరుతాయనే ఉద్దేశంతో భక్తులంతా విభూదిని నుదుట ధరించారు. శుక్రవారం తెల్లవారుజామున ఆలయంలో వీరభద్ర అవహన పూజలు నిర్వహించి అగ్నిగుండాల కార్యక్రమానికి తరలివెళ్లారు. అగ్నిగుండాల అనంతరం ఆలయానికి తిరిగివచ్చి గెలుపు, నాకబలి పూజలు అర్చకులు నిర్వహించారు.

**రామలింగేశ్వరస్వామికి పూజలు**

అగ్నిగుండాల మహోత్సవం అనంతరం భక్తులు రామప్ప రామ లింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. భక్తులతో పాటు పర్యాటకులు కూడా అధికసంఖ్యలో తరలివచ్చి రామలింగేశ్వరుడిని దర్శించుకోగా ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. రామప్పలో మూడు రోజుల పాటు జరిగిన ఉత్సవాలను విజయవంతం చేసిన భక్తులకు, వివిధ శాఖల అధికారులకు, సిబ్బందికి ఆలయ ఈఓ బిల్ల శ్రీనివాస్, ఎస్సై జక్కుల సతీష్ కృతజ్ఞతలు తెలిపారు.

---

**మున్సిపాలిటీ ఆస్తి పన్ను వసూలు వివరాలు..**

| భవనాల సంఖ్య | మొత్తం డిమాండ్ | వసూలు శాతం |
|---|---|---|
| 12,223 | రూ. 5.75కోట్లు | 60.84 |

| వసూలు | బకాయి |
|---|---|
| రూ. 3.50కోట్లు | రూ. 2.25కోట్లు |



# పంచాయతీలే ముందంజ

## పల్లెల్లో 74.62శాతం ఆస్తిపన్ను వసూలు

- మున్సిపాలిటీలో 60.84 శాతమే
- స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నా ఫలితం అంతంతే..
- మిగిలింది 30 రోజులే

భూపాలపల్లి: ఆస్తి పన్నుల వసూలులో గ్రామ పంచాయతీలే ముందున్నాయి. జిల్లాలోని ఏకైక భూపాలపల్లి మున్సిపాలిటీ లక్ష్యం చేరుకునే అవకాశం కనిపించడం లేదు. ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో 30 రోజులు మాత్రమే గడువు ఉండగా పల్లెలు వందశాతానికి చేరువ కానుండగా మున్సిపాలిటీలో మాత్రం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నా ఫలితం అంతంత మాత్రంగానే ఉంది.

**పల్లెలే బెస్ట్..**

జిల్లాలోని 12 మండలాల్లో 248 గ్రామ పంచాయతీలు ఉండగా, వాటి నుంచి రూ. 4కోట్ల 4లక్షల 52వేల 378 ఆస్తి పన్ను రావాల్సి ఉండగా నిన్నటి (శుక్రవారం) వరకు 74.62 శాతం వసూలు అయ్యాయి. మిగిలిన బకాయిలను ఈ నెల చివరిలోపు వసూలు చేసేందుకు పంచాయతీ అధికారులు ప్రయత్నిస్తున్నారు. అత్యధికంగా కాటారం మండలంలో 91.36 శాతం, మొగుళ్లపల్లిలో 81.64 శాతం వసూలు అయ్యాయి. టేకుమట్ల 64.98 శాతం వసూలు చేసి చివరి స్థానంలో నిలిచింది. ఈ నెల చివరిలోపు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 90 శాతానికి పైగా పన్ను వసూలు జరిగే అవకాశాలున్నాయి.

**మున్సిపాలిటీ లక్ష్యం చేరేనా..?**

భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డుల్లో నివాస, వ్యాపార, నివాస, వ్యాపార భవనాలు 12,223 ఉన్నాయి. వాటి నుంచి రూ. 5.75 కోట్ల ఆస్తి పన్ను రావాల్సి ఉండగా.. నిన్నటి వరకు 60.84 శాతం రూ.3.50 కోట్లు వసూలు అయ్యాయి. రూ.2.25 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. బకాయిల వసూలు కోసం మున్సిపాలిటీ అధికారులు నెల రోజులుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. తొమ్మిది బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో టీంలో ఐదుగురు అధికారులను నియమించారు. వీరు భారీ మొత్తంలో పన్ను బకాయి ఉన్న వారి భవనాల వద్దకు వెళ్లి నోటీసులు జారీ చేస్తూ పన్నులు వసూలు చేస్తున్నారు. అయినప్పటికీ పన్నులు చెల్లించని పక్షంలో ఆస్తులను సైతం జప్తు చేస్తున్నారు. అయినప్పటికీ వసూలు అంతంత మాత్రంగానే అవుతోంది.



**నెల రోజుల్లో 37 శాతం వసూలు చేశాం**



భూపాలపల్లి మున్సిపాలిటీ కమిషనర్‌గా నెల రోజుల క్రితం బాధ్యతలు తీసుకున్నాను. నేను వచ్చినప్పుడు కేవలం 24 శాతం మాత్రమే పన్ను వసూలు అయ్యాయి. ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి ఆస్తి పన్నులను వసూలు చేస్తున్నాం. భారీ మొత్తంలో బకాయి ఉన్న వారి వద్దకు నేరుగా నేనే వెళ్లి వసూలు చేస్తున్నా. ఫిబ్రవరి నెలలోనే 37 శాతం వసూలు చేశాం.

- బిర్రు శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్

**గ్రామ పంచాయతీల్లో ఆస్తి పన్నుల వివరాలు(రూ.లక్షల్లో)**

| మండలం | డిమాండ్ | వసూలు | బకాయి |
|---|---|---|---|
| భూపాలపల్లి | రూ.30,45,525 | రూ. 21,31,502 | రూ.9,14,023 |
| చిట్యాల | రూ.34,68,947 | రూ.25,02,159 | రూ.9,66,788 |
| గణపురం | రూ.83,25,662 | రూ.64,00,652 | రూ.19,25,010 |
| కాటారం | రూ.36,97,673 | రూ.33,78,344 | రూ.3,19,329 |
| మహదేవపూర్ | రూ.48,12,178 | రూ. 35,43,923 | రూ. 12,68,255 |
| మహాముత్తారం | రూ.17,89,060 | రూ.12,25,319 | రూ.5,63,741 |
| మల్హర్ | రూ.28,98,421 | రూ.20,11,448 | రూ.8,86,973 |
| మొగుళ్లపల్లి | రూ.26,03,332 | రూ.21,25,452 | రూ.4,77,880 |
| పలిమెల | రూ.5,65,619 | రూ.4,38,868 | రూ.1,26,751 |
| రేగొండ, కొత్తపల్లిగోరి | రూ.62,47,790 | రూ.44,78,331 | రూ.17,69,459 |
| టేకుమట్ల | రూ.29,98,171 | రూ.19,48,074 | రూ.10,50,097 |
| మొత్తం | రూ. 4,04,52,378 | రూ. 3,01,84,072 | రూ. 1,02,68,306 |

# ఉద్యోగ విరమణ తప్పనిసరి

ఎస్పీ కిరణ్‌ఖరే

భూపాలపల్లి రూరల్: ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి అని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన గుండు నాగభూషణం -పద్మ దంపతులను జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. గృహోపకరణాలను బహుమతిగా అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసులంటేనే ఎన్నో రకాల త్యాగాలతో పాటు, కుటుంబాలకు దూరంగా ఉంటూ ప్రజలకు సేవలందిస్తారన్నారు. సుమారు 40 సంవత్సరాల పాటు సర్వీస్ పూర్తిచేసిన హెడ్ కానిస్టేబుల్ నాగభూషణం సేవలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. నాగభూషణం అనుభవం, సేవలు భవిష్యత్ తరాలకు ఎంతో స్ఫూర్తివంతంగా నిలుస్తాయని చెప్పారు. ఏదేని సమస్యలు ఉంటే రిటైర్డ్ ఉద్యోగులు తనను సంప్రదించి సమస్యలు పరిష్కరించుకోవాలని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఎస్సైలు నగేష్, కిరణ్, శ్రీకాంత్, రత్నం, పోలీసు అధికారుల సంఘం నేత యాదిరెడ్డి పాల్గొన్నారు.



హెడ్‌కానిస్టేబుల్ నాగభూషణాన్ని సన్మానిస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే

### కాలనీల్లో పర్యటించిన కమిషనర్

భూపాలపల్లి అర్బన్: పట్టణంలోని పలు కాలనీల్లో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ శుక్రవారం పర్యటించారు. రాజీవ్‌నగర్, కారల్‌మార్క్స్‌కాలనీల్లో ఇంటింటికీ తిరిగి తాగునీటి సరఫరాను పరిశీలించారు. ప్రతి రోజు నీటి సరఫరా సరిగా వస్తుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వేసవి కాలంలో నీటి సమస్య రాకుండా నీటిని వృథా చేయవద్దన్నారు. అనంతరం పాత గ్రామ పంచాయతీ కార్యాలయంలో వాటర్ సప్లై, ఎలక్ట్రిషన్ స్టాక్ రిజిస్టర్‌లు, మెటీరియల్స్, సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్‌ను కొనసాగించాలని పట్టణంలో వీధి దీపాల అంతరాయం ఉండకుండా ఎప్పటికప్పుడు మరమ్మతు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ మానస, సిబ్బంది పాల్గొన్నారు.



స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న కమిషనర్

# ప్రశ్నించినందుకే హత్య చేశారు..

పౌర హక్కుల సంఘం రాష్ట్ర నాయకులు

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో జరుగుతున్న అక్రమాలు, న్యాయం కోసం ప్రశ్నిస్తూ, కోర్టులో కేసులు వేయడం వలనే సామాజిక కార్యకర్త రాజలింగమూర్తిని హత్య చేశారని పౌర హక్కుల సంఘం రాష్ట్ర కన్వీనర్ నారాయణ తెలిపారు. పౌర హక్కుల సంఘం నాయకులు శుక్రవారం రాజలింగమూర్తి కుటుంబ సభ్యులను పరామర్శించి హత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా భూ అక్రమాలు, మాఫియాలపై కేసులు వేస్తే 80మంది వరకు హత్యగావించబడ్డారన్నారు. ఈ హత్యకు పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రభుత్వంపై విశ్వాసం కోల్పోయి ప్రజలు తిరగబడుతారని తెలిపారు.



మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పౌరహక్కుల సంఘం నాయకులు

# ఫోన్‌పేతో బురిడీ..

కాటారం: డిజిటల్ లావాదేవీల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు, సంబంధిత శాఖ అధికారులు నిత్యం అవగాహన కల్పిస్తున్నప్పటికీ ఎక్కడో ఒక్కచోట కొందరు ప్రజలను, వ్యాపారులను బురిడీ కొట్టిస్తూనే ఉన్నారు. ఫేక్ ఫోన్ పే యాప్ ద్వారా శుక్రవారం ఓ దుకాణం యజమానిని మోసం చేసి చివరకు దుండగుడు దొరికిపోయాడు. బాధిత దుకాణం యజమాని తెలిపిన వివరాల ప్రకారం.. కాటారం మండలకేంద్రంలోని గారెపల్లిలో ముస్కమల్ల సత్యం ఆటోమొబైల్, స్పేర్ పార్ట్స్ దుకాణం నిర్వహిస్తున్నాడు. శుక్రవారం ఓ యువకుడు దుకాణానికి వచ్చి పలు రకాల సామగ్రి కొనుగోలు చేశాడు. అనుమానం రాకుండా సామగ్రికి సంబంధించిన ధరపై దుకాణం యజమానితో బేరాలు సైతం చేశాడు. సదరు వ్యక్తి కొనుగోలు చేసిన సామగ్రికి సంబంధించి రూ.4వేలు అయింది. ఫోన్ పే చేస్తానని చెప్పడంతో దుకాణం యజమాని సత్యం స్కానర్ చూపించాడు. ఫేక్ ఫోన్ పే ద్వారా రూ.4వేలు చెల్లించిన దుండగుడు పేమెంట్ సక్సెస్ అయినట్లు చూపించి వెళ్లిపోయాడు. కొంత సమయం వరకు కూడా డబ్బులు జమకాకపోవడంతో అనుమానం వచ్చిన దుకాణం యజమాని అకౌంట్ చెక్ చేసుకోగా డబ్బుల చెల్లింపు జరగలేదు. అప్రమత్తమైన యజమాని దుండగుడిని వెంబడించాడు. చివరకు భూపాలపల్లిలో పట్టుకొని ప్రశ్నించగా ఫేక్ ఫోన్ పే యాప్ ద్వారా చెల్లింపు చేసినట్లు ఒప్పుకున్నాడు. దుండగుడిది గొల్లబుద్ధారం సమీపం నర్సింగపురం అని తెలిసింది. మోసానికి పాల్పడిన యువకుడిని పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు దుకాణం యజమాని సత్యం తెలిపారు.

# విమానం ఎగురుడే..!

## మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు కేంద్రం పచ్చజెండా



- హెచ్‌ఐఎల్ ఇచ్చిన ఎన్‌ఓసీకి ఆమోదం
- రాష్ట్ర ప్రభుత్వం భూమి సేకరిస్తే ముందుకే..
- 253 ఎకరాలు ఏఏఐకి అప్పగిస్తే పనులు షురూ

సాక్షి, వరంగల్:

వరంగల్ నగరవాసులను దశాబ్దాలుగా ఊరిస్తున్న విమాన ప్రయాణం కొద్ది నెలల్లోనే సాకారం కానుంది. హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి 150 కిలోమీటర్ల దూరంలో 2038 సంవత్సరం వరకు మరో వాణిజ్య విమానాశ్రయం ఉండద్దని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (హెచ్‌ఐఎల్)కు ఒప్పందం ఉన్నా.. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆ సంస్థతో చర్చలు జరపడంతో నిరంభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) ఇచ్చింది. దీనికి కేంద్రం కూడా అంగీకారం తెలిపింది. ముఖ్యంగా మామునూరు విమానాశ్రయ నిర్మాణం కోసం 253 ఎకరాల అదనపు భూమిని సేకరించి ఇస్తే ఏఏఐ టెండర్లు పిలిచి త్వరలో నిర్మాణ పనులు ప్రారంభించే అవకాశముంది. ఇప్పటికే ఈ భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.205 కోట్లను విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ దిశగా వరంగల్ రెవెన్యూ అధికారులు కూడా భూసర్వే చేసి పూర్తి వివరాలను కలెక్టర్ డాక్టర్ సత్యశారదకు ఇచ్చారు. భూ నిర్వాసితులకు భూమికి బదులు భూమి, కాదనుకునేవారికి నష్టపరిహారం ఇవ్వనున్నారు. మరోమారు గాడిపల్లి, గుంటూరుపల్లి, నక్కలపల్లి, మామునూరు రైతులతో చర్చలు జరిపి సాధ్యమైనంత తొందరగా ఈ భూమి ఏఏఐకి అప్పగిస్తే నిర్మాణ పనులు ప్రారంభమవుతాయి. మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణ తొలి దశను డిసెంబర్‌లోగా పూర్తిచేసి దేశీయ విమానాల రాకపోకలను ప్రారంభించేందుకు రేవంత్‌రెడ్డి సర్కారు కృతనిశ్చయంతో ఉండడంతో మామునూరులో విమానాలు ఎగరడం ఖాయంగానే కనిపిస్తోంది. భూసేకరణ పూర్తయితే 150నుంచి 186మంది ప్రయాణించేలా వీలున్న 37.6 మీటర్లు (123 ఫీట్ల) పొడవున్న ఏ 320, బీ-737 విమానాలు రాకపోకలు సాగించనున్నాయి.

**2022లో ‘ఉడాన్’కు ఎంపిక**

చిన్న నగరాలను రాష్ట్ర, దేశ రాజధానులతో కలిపేందుకు కేంద్రం 2016లో ఉడాన్ (ఉడే దేశ్ కీ ఆమ్ నాగరిక్) పథకం తీసుకొచ్చింది. దీని కింద మామునూరు విమానాశ్రయాన్ని 2022 సెప్టెంబర్‌లో ఎంపిక చేసింది. వరంగల్ శివారులోని మామునూరులో నిజాం కాలంలో ఎయిర్ స్ట్రిప్ అందుబాటులో ఉండేది. అక్కడ 1400 మీటర్ల పొడవైన రన్ వే, గ్లైడర్స్ దిగేందుకు మరో చిన్న రన్ వే ఉంది. దశాబ్దాలుగా వినియోగం లేకపోవడంతో అవి బాగా దెబ్బతిన్నాయి. ఇప్పటికీ ఆ పాత ఎయిర్‌స్ట్రిప్‌కు చెందిన 696 ఎకరాల భూమి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆధీనంలో ఉంది. ఈ రన్ వే విస్తరణ కోసం అదనంగా అవసరమయ్యే 253 ఎకరాల భూసేకరణ జరగాలంటే ప్రజాప్రతినిధుల తోపాటు రెవెన్యూ అధికారులు దృష్టి సారించాలి.

**కొచ్చిన్ ఎయిర్‌పోర్ట్ తరహాలో..**

కేరళ రాష్ట్రంలోని కొచ్చిన్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అధ్యయనం చేసి అక్కడి మాదిరిగా ఇక్కడ వసతులు కల్పించేలా చూడాలని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. దీంతో అక్కడి ప్రత్యేకత ఏమిటనే చర్చ వచ్చింది. ‘కొచ్చిన్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్ (సీఐఏఎల్) పట్టణానికి 28 కిలోమీటర్ల దూరంలో నెడుంబస్సెరీ ప్రాంతంలో 1,213 ఎకరాల్లో నిర్మించారు. 1999 మే 25న అందుబాటులోకి వచ్చింది. ఏ ప్రాంతం నుంచైనా చేరుకునేలా 56 రేడియల్ రోడ్లను నిర్మించారు. సమీప పర్యాటక ప్రాంతాలైన పథనంతిట్ట, ఎర్నాకులం, కొట్టాయం, అలిప్పి నుంచి నేరుగా చేరుకులా ఎక్స్‌ప్రెస్ జాతీయ రహదారులను అందుబాటులోకి తెచ్చారు. ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ)లో నిర్మించిన తొలి ఎయిర్‌పోర్ట్ ఇది. 32 దేశాలకు చెందిన 10వేల మంది ఎన్‌ఆర్‌ఐలు ఈ విమానాశ్రయ నిర్మాణానికి నిధులు ఇచ్చారు. కొచ్చిన్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రస్తుతం 31 అంతర్జాతీయ, 22 దేశీయ గమ్యస్థానాలకు విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయి. పూర్తిగా సోలార్ విద్యుత్‌తో నడిచే విమానాశ్రయాల్లో అంతర్జాతీయంగా మొదటి స్థానంలో ఉంది. తొలుత దేశీయ విమానాల రాకకు టెర్మినల్స్‌ను నిర్మించారు. అనంతరం దశల వారీగా విస్తరణ చేశారు. ప్రస్తుతం మూడు టెర్మినల్స్ ఉన్నాయి. ఒకటి దేశీయ, రెండోది అంతర్జాతీయ విమానాల రాకపోకలకు సేవలు అందిస్తోంది. మరో దానిలో కార్గో సేవలను నిర్వహిస్తున్నారు. 2023-2024లో 1.08 కోట్ల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. ప్రయాణికుల రాకపోకల పరంగా దేశంలోనే ఎనిమిదో స్థానంలో ఉంది’ అని పౌర విమానాయన శాఖకు చెందిన ఓ అధికారి తెలిపారు.

**పర్యాటకం, ఐటీ, పరిశ్రమలకు బూస్ట్..**

వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్ట్ ప్రారంభమైతే పర్యాటకం, పరిశ్రమలు, ఐటీ రంగాలు అభివృద్ధి చెందనున్నాయి. సమీపంలోని పర్యాటక ప్రాంతాలైన భద్రాచలం, రామప్ప, లక్నవరం, మేడారానికి మరింతగా సందర్శకులు పెరుగుతారని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. టైర్ 2 పట్టణాల్లోనూ ఐటీ విస్తరణ కార్యక్రమంలో భాగంగా ఎయిర్‌పోర్ట్ కీలకంగా మారనుంది. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులోని కైటెక్స్ మాదిరిగానే మరిన్ని అంతర్జాతీయ వ్యాపార సంస్థలు ముందుకు వస్తే పెట్టుబడులు పెరిగి ఇక్కడి ప్రాంతం అభివృద్ధి చెందే అవకాశం ఉంది. వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కే అవకాశం ఉంది.

# నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

- పుష్కరాల పనులు వేగవంతం
- కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి: పదో తరగతి ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. ఐడీఓసీ కార్యాలయంలో ఎంఈఓలు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మార్చి 21వ తేదీ నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరుగనున్న పదో తరగతి పరీక్షల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా 21 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 3,449 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. గతేడాది తక్కువ శాతం ఫలితాలు సాధించిన పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఈ ఏడాది ఖచ్చితంగా వందశాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని సూచించారు. సమావేశం ప్రారంభానికి ముందు జ్యోతి ప్రజ్వలన చేసి రామానుజం చిత్ర పటానికి పూల మాలలు వేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈఓ రాజేందర్, డీపీఆర్ఓ శ్రీనివాస్, పరీక్షల విభాగం ప్రత్యేక అధికారి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

**పుష్కర ఏర్పాట్లు వేగిరం చేయాలి..**

కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాల ఏర్పాట్లు వేగవంతం చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఏర్పాట్లపై రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, దేవాదాయ, విద్యుత్‌శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇరిగేషన్ 4, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం 7, మిషన్ భగీరథ 15, దేవస్థానం ఇంజనీరింగ్ విభాగం 28, విద్యుత్ 11 మొత్తం 65 పనులు పూర్తి చేయాల్సి ఉన్నట్లు తెలిపారు. త్వరలో ఎన్నికల కోడ్ ముగియనున్నందున పనులు సత్వరమే చేపట్టేలా అన్ని శాఖల అధికారులు సన్నద్ధంగా ఉండాలని సూచించారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆయా శాఖల ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

**పీఎం శ్రీ పనులు పూర్తి చేయాలి..**

పీఎం శ్రీ, సర్వ శిక్షా అభియాన్ పనులను మార్చి 20వ తేదీలోపు పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఐడీఓసీ కార్యాలయంలో ఆయా శాఖల ఇంజనీరింగ్ అధికారులతో నిధులు మంజూరు, చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు. ఈ సమావేశంలో డీఈఓ రాజేందర్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

**ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి..**

ఇంటర్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు, ఎల్ఆర్ఎస్ పెండింగ్ దరఖాస్తులు పూర్తి చేసే అంశాలపై హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఐడీఓసీ కార్యాలయం నుంచి కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం రెవెన్యూ, ఇంటర్మీడియట్, పంచాయతీరాజ్, మున్సిపల్, విద్యుత్, ఆర్టీసీ, వైద్య శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. 3,720 మంది పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



విద్యాశాఖ అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

## క్లుప్తంగా

### ఈఎంటీ మమతకు ఉత్తమ సేవా అవార్డు



హన్మకొండ అర్బన్: జిల్లాలోని 108 సర్వీస్ విభాగంలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటీ)గా విధులు నిర్వర్తిస్తున్న మమతను ప్రభుత్వం ఉత్తమ సేవా అవార్డుకు ఎంపిక చేసింది. పేద ప్రజలకు తాను చేసిన సేవలకు గుర్తింపుగా తనను ఈ సంవత్సరం ఉత్తమ సేవా అవార్డుకు ఎంపిక చేసినట్లు ఆమె పేర్కొన్నారు. కాగా.. 108 సర్వీస్ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శివ కుమార్ చేతుల మీదుగా శుక్రవారం ఈఎంటీ మమత ఈఅవార్డును అందుకున్నారు.

### మెజీషియన్ శ్రీనివాస్ రెడ్డికి..



అవార్డు అందుకుంటున్న శ్రీనివాస్ రెడ్డి

హన్మకొండ: ప్రముఖ మెజీషియన్ జూలుకుంట్ల శ్రీనివాస్‌రెడ్డికి అత్యుత్తమ అవార్డు లభించింది. భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో ఆర్.కే.వండర్ వరల్డ్, తెలంగాణ మేజిక్ అకాడమీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి హైదరాబాద్ రవీంద్రభారతిలో వరల్డ్ మెజీషియన్స్ డే వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో హనుమకొండ టీచర్స్ కాలనీ–2కు చెందిన శ్రీనివాస్ రెడ్డి నిర్వాహకులు పీ.సీ సర్కార్ (సీనియర్) మెమోరియల్ అవార్డు అందుకున్నారు. ఆర్టీసీ డ్రైవర్‌గా రిటైర్ అయిన శ్రీనివాస్ రెడ్డి.. ఇంద్రజాలికుడిగా రాణిస్తున్నారు. డ్రైవర్‌గా పని చేస్తున్న కాలంలోనే తన ప్రదర్శనలతో అనేక పర్యాయాలు అవార్డులు అందుకున్నారు.

### నేటి నుంచి పలు రైళ్లు రద్దు

కాజీపేట రూరల్: సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో సాంకేతిక నిర్వహణ కారణంగా మార్చి 1 నుంచి పలు రైళ్లను పలు రూట్‌లలో రద్దు చేస్తున్నట్లు శుక్రవారం రైల్వే అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాజీపేట టౌన్ రైల్వే స్టేషన్‌లో తాత్కాలికంగా పలు రైళ్లకు నెల రోజుల పాటు హాల్టింగ్ తొలగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. మార్చి 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు కాజీపేట–బల్లార్షా (17035) వెళ్లే రామగిరి ప్యాసింజర్, మార్చి 2వ తేదీ నుంచి 6వ తేదీ వరకు బల్లార్షా–కాజీపేట (17036) రామగిరి ప్యాసింజర్ రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మార్చి 1 నుంచి 31వ తేదీ వరకు భద్రాచలం–బల్లార్షా (17033) వెళ్లే సింగరేణి ప్యాసింజర్, సిర్పూర్ టౌన్–భద్రాచలం (17034) వెళ్లే సింగరేణి ప్యాసింజర్ మార్చి 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు కాజీపేట టౌన్ రైల్వే స్టేషన్‌లో తాత్కాలికంగా హాల్టింగ్ తొలగించినట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు.

### విద్యుదాఘాతంతో మహిళ దుర్మరణం



యాదమ్మ (ఫైల్)

దేవరుప్పుల : విద్యుదాఘాతంతో మహిళ మృతిచెందిన ఘటన శుక్రవారం కడవెండిలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలోని కడవెండికి చెందిన సులుగూరి యాదమ్మ(45) తన ఇంటి ఎదుట వాకిలి ఊడ్చే క్రమంలో మోటార్ వైర్ తగిలి విద్యుత్ షాక్ కొట్టడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందింది. యాదమ్మ భర్త రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై సృజన్ కుమార్ తెలిపా రు. మృతురాలికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



# తుది నిర్ణయం సీఎస్‌దే..

## కేయూలో ఆ అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకంపై సుప్రీంకోర్టు తీర్పు

- వారం రోజుల్లో అభ్యర్థనలను చీఫ్ సెక్రటరీకి ఇవ్వొచ్చని సూచన
- రెండు నెలల్లో సీఎస్ నిర్ణయం తీసుకోవాలని ఆదేశం



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో 2010లో వివిధ విభాగాల్లో నియామకమైన అసిస్టెంట్ ప్రొఫెసర్ల అంశంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరిదే(సీఎస్) తుది నిర్ణయం కానుంది. ఈ మేరకు వీరి నియామకంపై తుది నిర్ణయం తీసుకోవాలని సుప్రీం కోర్టు (ఫిబ్రవరి 24న) సీఎస్‌ను ఆదేశించింది. వారం రోజుల్లో ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అలాగే, వీరి నియామకాలపై వ్యతిరేకంగా కోర్టును ఆశ్రయించిన వారు కూడా తమ అభ్యర్థనలను సీఎస్‌కు విన్నవించుకునే అవకాశాన్ని కల్పించింది. ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకంపై సీఎస్ రెండునెలల్లో తుది నిర్ణయం తీసుకోవాల్సింటుందని పేర్కొంది.

**ఇటీవలే కమిటీని నియమించిన ప్రభుత్వం..**

వీరి నియామకానికి సంబంధించి తుది నిర్ణయం కోసం ప్రభుత్వం గతంలోనే ఓ కమిటీని నియమించింది. ఇందుకు విడుదల చేసిన ప్రభుత్వ జీఓను వ్యతిరేకిస్తూ అప్పట్లో ఉద్యోగం రాని ఓ అభ్యర్థి వినీత నాయిని హైకోర్టును ఆశ్రయించింది. దీంతో హైకోర్టు ఆ కమిటీని ఎలాంటి సమావేశం నిర్వహించకూడదని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన విషయం విధితమే. అసిస్టెంట్ ప్రొఫెసర్లు కొందరు కమిటీ వేసి నిర్ణయం తీసుకోవాలనేది పలువురు ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్లు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. దీంతో గతేడాది ఆగస్టులో హైకోర్టు డివిజన్ బెంచ్ కూడా తుది నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వానికి సూచిస్తూ తీర్పునిచ్చింది. ఆరు నెలల్లో ఈ నియామకాలపై తుది నిర్ణయం తీసుకోవాలని ఉత్తర్వులు ఇచ్చింది. దీనిని వ్యతిరేకిస్తూ గతేడాది అక్టోబర్‌లో వినీత నాయిని, అంజన్‌రావు డివిజన్ బెంచ్ ఉత్తర్వులను రద్దు చేయాలని సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిని వ్యతిరేకిస్తూ పలువురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన ప్రకారం కమిటీ వేసి తమను ర్యాటిఫై చేయాలని తుది నిర్ణయం ప్రభుత్వం తీసుకోవాలని పేర్కొంటూ కోర్టును ఆశ్రయించారు. దీంతో ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ కేసును ముగిస్తూ పలు నిబంధనలతో కూడిన తీర్పును ఫిబ్రవరి 24న వెలువరించింది. తెలంగాణ ప్రభుత్వ సీఎస్‌నే తుది నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. వారంలో ఇరు పక్షాలు కూడా తమ అభ్యర్థనలను సీఎస్‌కు విన్నవించుకునే అవకాశం కల్పించింది. రెండు నెలల్లో నిర్ణయం కూడా వెలువరించాల్సి ఉంటుంది. అయితే సీఎస్ తీసుకునే నిర్ణయంపై మళ్లీ కోర్టును ఆశ్రయించే అవకాశం కూడా ఇరుపక్షాలకు సుప్రీకోర్టు అవకాశం కల్పించింది. ఇదిలా ఉండగా, సుప్రీంకోర్టు ఆదేశాలు రాకముందే గతంలో హైకోర్టు డివిజన్ బెంచ్ ఆదేశాలకు అనుగుణంగా ఇటీవలే ప్రభుత్వం ఓ కమిటీని కూడా నియమించింది. ఆ కమిటీ వీరి నియామకంపై సమాచారం తెప్పించుకొని పరిశీలిస్తుండగానే తాజాగా సుప్రీంకోర్టు ఆదేశాలతో ఇక సీఎస్ నిర్ణయం తీసుకోవాల్సింటుంది.

### 15 ఏళ్లు కావొస్తోంది.. కొనసాగుతున్న వివాదం

**2009లో వివిధ విభాగాల్లో 57 అసిస్టెంట్ ప్రొ**ఫెసర్ల, నాలుగు అసోసియేట్ ప్రొఫెసర్ల నియామకానికి నోటిఫికేషన్‌ను అప్పటి యూనివర్సిటీ అధికారులు జారీచేశారు. దరఖాస్తులు స్వీకరించి ఇంటర్వ్యూల అనంతరం 38 మందిని ఎంపిక చేశారు. అప్పట్లోనే ఈ నియామకాలపై పలువురు ఉద్యోగం రాని అభ్యర్థులు ఇందులో అవకతవకలు జరిగాయంటూ ఆందోళన చేశారు. అంతేకాకుండా పలువురు హైకోర్టు, ఆ తరువాత, సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించిన విషయం విధితమే. పూర్తిస్థాయి పాలకమండలిలో ఈ **నియామకాలు ఆమోదించుకోవచ్చునని 2015** లోనే సుప్రీంకోర్టు సూచించింది. చివరకు 2019 నవంబర్‌లో కేయూ పూర్తిస్థాయి పాలకమండలి సమావేశంలో ఈ అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకంపై చర్చించింది. అవకతవకలు చోటుచేసుకున్నాయని వీరి నియామకాన్ని పాలకమండలి ఆమోదించలేదు. దీంతో అప్పటి రిజిస్ట్రార్ కె.పురుషోత్తమ్ ఈ నియామకాలపై తుది నిర్ణయం కోసం ఫైల్‌ను 2019లోనే రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. అప్పటి నుంచి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా జాప్యం చేసింది ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్లలో గతంలో హైకోర్టు తీర్పు మేరకు జువాలజీ విభాగానికి చెందిన ఇద్దరిని యూనివర్సిటీ అధికారులు కొంతకాలం క్రితమే ఉద్యోగం నుంచి టర్మినేషన్ చేసిన విషయం విధితమే. ఇదిలా ఉండగా ప్రస్తుతం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో సీఎస్‌కు తుది నిర్ణయం తీసుకోవాలని ఆదేశించడాన్ని ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్లు స్వాగతిస్తున్నారు. కాగా, ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్లలో ఇప్పటికే ముగ్గురు ఉద్యోగ విరమణ పొందగా.. మరో ఇద్దరు చనిపోయారు. అప్పట్లోనే ఒకరు రాజీనామా చేశారు. ఇద్దరు టర్మినేషన్ అయిన విషయం విధితమే.

# అమెరికా భాగస్వామ్యంతో వ్యాపారాల విస్తరణ

- అమెరికా కాన్సులేట్ జనరల్ జెన్నీఫర్ లార్సన్



సదస్సులో పాల్గొన్న కాన్సులేట్ జనరల్ జెన్నీఫర్ లార్సన్, పులి రవి, చాంబర్ ప్రతినిధులు

వరంగల్: అమెరికాకు చెందిన వ్యాపారులతో వరంగల్ వ్యాపార, వాణిజ్య సంస్థల నిర్వాహకులు భాగస్వామ్యం చేసుకుని తమ వ్యాపారాలను విస్తరించుకోవాలని హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ జెన్నీఫర్ లార్సన్ అన్నారు. గురువారం రాత్రి వరంగల్ స్టేషన్‌రోడ్ సమీపంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్వర్యంలో 'భారత్– అమెరికా వ్యాపార సంబంధాల అభివృద్ధి, వ్యాపార అవకాశాల వినియోగం' అనే అంశంపై జరిగిన సదస్సులో ఇండో అమెరికన్ ఇంపాక్ట్ గ్రూప్ వ్యవస్థాపక అధ్యక్షుడు పులి రవితో కలసి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జెన్నీఫర్ లార్సన్ మాట్లాడుతూ.. వరంగల్ వ్యాపారులు తమ ఉత్పత్తులు, సరుకులను నాణ్యతతో ఎగుమతి చేసేందుకు ముందుకొస్తే సహకారం అందిస్తామన్నారు. పులి రవి మాట్లాడుతూ.. ప్రస్తుతం అన్ని రంగాల్లో పోటీతత్వంతో వ్యాపార నిర్వహణ జరుగుతున్నదన్నారు. వ్యాపార రంగంలో అమెరికాతో భాగస్వామ్యమైతే వరంగల్ పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అందుకు అనుగుణంగా తెలంగాణలో మౌలిక వసతులు, రవాణా అభివృద్ధితోపాటు వరంగల్ నగరంలో ఎయిర్‌పోర్టు, హోటల్స్, పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చోటు చేసుకుంటుందని తెలిపారు. ఈ మౌలిక సదుపాయాలను వినియోగించుకుని మన యువత భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం చాంబర్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, వేద ప్రకాశ్ మాట్లాడుతూ ఇటీవల అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్–ప్రధాని మోదీ భేటీలో ఇండో అమెరికా వ్యాపారం 5వేల బిలియన్ డాలర్ల లక్ష్యానికి చేర్చాలని నిర్ణయించినట్లు తెలిపారు. దానికి కొనసాగింపుగా అమెరికా కాన్సులేట్ జనరల్ జెన్నీఫర్ లార్సన్, ఇండో అమెరికన్ ఇంపాక్ట్ గ్రూప్ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు పులి రవి వరంగల్ వ్యాపారస్తులు, విద్య, వైద్య, ఇతర సేవా రంగాల్లో పనిచేస్తున్న నిపుణులకు సలహాలు సూచనలు అందించడం గొప్ప విషయమన్నారు.

### రైలు కిందపడి రైల్వే ఉద్యోగి ఆత్మహత్య



తిరుపతి (ఫైల్)

కాజీపేట రూరల్: కాజీపేట జీఆర్పీ పోలీస్ స్టేషన్ పరిధిలోని మడికొండ శివారు రైల్వే ట్రాక్ పరిధిలో శుక్రవారం రైల్వే ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నట్లు కాజీపేట జీఆర్పీ పోలీసులు తెలిపారు. కాజీపేట జీఆర్పీ ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మడికొండ వినాయకనగర్‌కు చెందిన రైల్వే ఉద్యోగి పెనుకుల తిరుపతి (42) కొంతకాలం క్రితం తలకుగాయంతో అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అప్పటి నుంచి అయన మానసికస్థితి బాగలేదు. ఈక్రమంలో పెండ్యాల–కాజీపేట రైల్వే జంక్షన్ల మధ్య మడికొండ శివారు రైల్వే ట్రాక్‌పై సికింద్రాబాద్ నుంచి గుంటూరు వెళ్లే ఇంటర్‌సిటీ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. తిరుపతి భార్య అర్చన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు తెలిపారు. మృతుడికి భార్య అర్చన, పాప, బాబు ఉన్నారు.

# 'సహకార' అభివృద్ధికి నాబార్డు చేయూత

- గుర్తింపు సంఘాలను సందర్శించిన నాబార్డు అధికారులు



డీసీసీబీ చైర్మన్, అధికారులతో సమావేశమైన నాబార్డు ప్రతినిధులు

హన్మకొండ: ప్రాథమిక సహకార సంఘాల బలోపేతానికి నాబార్డు ఆర్థిక చేయూతనందించేందుకు ముందుకొచ్చింది. ఇప్పటికే బహుళార్థక సేవల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఆర్థిక సాయం అందించిన నాబార్డు, మరో కొత్త కార్యక్రమం పాక్స్ ఆక్సిలేటర్ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా ఎంపిక చేసిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు తక్కువ వడ్డీకి రుణసాయం అందిస్తుంది. రైతులకు రుణాలు ఇవ్వడమే కాకుండా వివిధ వ్యాపారాలు నిర్వహించి సంఘాలు ఆర్థిక పరిపుష్టి సాధించేందుకు చేయూతనిస్తుంది. ఈ క్రమంలో శుక్రవారం నాబార్డు (ముంబై) జనరల్ మేనేజర్ రమేశ్ బాబు, మేనేజర్ హరిహరన్, వరంగల్ డీడీఎం చంద్రశేఖర్ ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నందనం, నర్సంపేట, ధనసరి, మహబూబాబాద్, నల్లబెల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను సందర్శించారు. ఈ సంఘాలు నిర్వహిస్తున్న కార్యక్రమాలు, వ్యాపారాల వృద్ధిని తెలుసుకున్నారు. అనంతరం వరంగల్ డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో డీసీసీబీ చైర్మన్ రవీందర్ రావు, సీఈఓ వజీర్ సుల్తాన్, బ్యాంక్ అధికారులతో సమావేశమయ్యారు. సహకార సంఘాల అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు. డీసీసీబీ జనరల్ మేనేజర్ ఉష శ్రీ, డీజీఎం అశోక్ పాల్గొన్నారు.

# సూపర్ న్యూమరీ పీహెచ్‌డీ అడ్మిషన్లు

- 40మంది ప్రవేశాలకు రంగం సిద్ధం
- డీన్‌ల సమావేశంలో నిర్ణయించిన వీసీ, రిజిస్ట్రార్లు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వివిధ విభాగాల్లో సూపర్ న్యూమరీగా పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించాలని నిర్ణయించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి, ఎస్సీ, ఎస్టీ, బీసీ కమిషన్‌లనుంచి వేర్వేరుగా సుమారు 40మంది అభ్యర్థుల పేర్లతో కూడిన జాబితాలు ఇటీవల యూనివర్సిటీ వీసీ ప్రతాప్‌రెడ్డికి అందినట్లు సమాచారం. శుక్రవారం సాయంత్రం యూనివర్సిటీలో వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం.. వివిధ విభాగాల డీన్‌లతో సమావేశం నిర్వహించారు. పైనుంచి వచ్చిన జాబితాల్లోని వారికి సూపర్ న్యూమరీ కేటగిరీగా పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించడంపై చర్చించినట్లు తెలిసింది. ఈ విధంగా అడ్మిషన్లు కల్పించడం నియమనిబంధనలకు విరుద్ధమనే అభిప్రాయం కూడా పలువురు వ్యక్తం చేసినట్లు సమాచారం. తీరా అడ్మిషన్లు కల్పించాక ఎవరైనా కోర్టుకెళ్తే సమస్య తలెత్తే అవకాశం ఉందనేది కూడా చర్చించినట్లు తెలుస్తోంది. చివరికి ఆయా అభ్యర్థులకు పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించాలని నిర్ణయించారు. మార్చి 4న కేయూ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదింపజేసి ఆ తరువాత జరగబోయే పాలకమండలి సమావేశంలోనూ అప్రూవల్ తీసుకున్నాక అడ్మిషన్లు ఇవ్వాలని సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో వివిధ విభాగాల డీన్‌లు టి.మనోహర్, రాంనాథ్‌కిషన్, గాదె సమ్మయ్య, ఎం.శ్రీనివాస్, పాలక మండలి సభ్యుడు, దూరవిద్యాకేంద్ర డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సురేష్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

**ఇప్పటికే 450కిపైగానే పీహెచ్‌డీ అడ్మిషన్లు**

కాకతీయ యూనివర్సిటీలో 2021–2022లో వివిధ విభాగాల్లో 210 పీహెచ్‌డీ సీట్లకు మొదటి దశ ప్రవేశాలు ముగిశాక, సీట్లు రాని అభ్యర్థులు కొందరు ఆందోళనలు చేసిన విషయం తెలిసిందే. తదనంతర పరిణామాల నేపథ్యంలో మళ్లీ సంవత్సరం తర్వాత రెండు, మూడో దశ కూడా అప్పటి మెరిట్ జాబితా, రిజర్వేషన్ల ప్రకారం అడ్మిషన్లు కల్పించారు. మూడు దశలు కలిపి మొత్తంగా 450మందికిపైగానే అడ్మిషన్లు కల్పించారు. ఈ మూడు దశల్లో సీట్లురాని కొందరు అభ్యర్థులు ఉన్నత విద్యామండలి చైర్మన్, ఎస్సీ, ఎస్టీ, బీసీ కమిషన్‌ల వద్దకు వెళ్లి అభ్యర్థించినట్లు సమాచారం. దీంతో వారు వేర్వేరుగా పేర్లతో కూడిన జాబితాలు యూనివర్సిటీ అధికారులకు పంపారు. ఇప్పుడు వారికి సూపర్‌న్యూమరీ కేటగిరీగా అడ్మిషన్లు కల్పించబోతున్నారు. దీనిపై నాలుగైదు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**మరికొందరు యూనివర్సిటీ చుట్టూ ప్రదక్షిణలు**

ఉన్నత విద్యామండలి చైర్మన్, ఎస్సీ, ఎస్టీ, బీసీ కమిషన్లు పంపిన జాబితాల్లో పేర్లు లేని మరికొందరు తమకు కూడా పీహెచ్‌డీ సీట్లు ఇవ్వాలని యూనివర్సిటీకి వచ్చిపోతున్నారు. ఒక వైపు ఫెల్లోషిప్‌లు కలిగిన వారికే పీహెచ్‌డీ అడ్మిషన్లు అంటూ యూనివర్సిటీ వివిధ విభాగాల డీన్‌లు.. సోషల్‌సైన్స్, సైన్స్ విభాగాల్లో నోటిఫికేషన్ ఇచ్చి దరఖాస్తులు స్వీకరించారు. వీరికి కూడా అడ్మిషన్లు కల్పించబోతున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ఇటీవల పీహెచ్‌డీ అడ్మిషన్లకు నోటిఫికేషన్ ఇచ్చింది. ఇదేమాదిరిగా కేయూ అధికారులు నోటిఫికేషన్ ఇవ్వకుండా ఇలా సూపర్ న్యూమరీ కేటగిరీగా అడ్మిషన్లు కల్పిస్తే ఎలా అని పీజీ కోర్సులు పూర్తయిన వారు ప్రశ్నిస్తున్నారు.

# సమాజహిత పరిశోధనలు అవసరం



వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో అతిథులు

- కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: దేశ ప్రగతి సైన్స్‌పైన ఆధారపడి ఉందని, సీవీరామన్ లాంటి నోబెల్ శాస్త్రవేత్తను అందించిన దేశం భారత్ అని, సమాజహిత పరిశోధనలపై దృష్టిసారించాల్సిన అవసరం ఉందని కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ప్రతాప్‌రెడ్డి అన్నారు. కాకతీయ యూనివర్సిటీలోని సెనెట్‌హాల్‌లో శుక్రవారం నిర్వహించిన ఒక రోజు జాతీయ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సర్ రోనాల్డ్ రోస్ లాంటి గొప్ప వ్యక్తులు తమకు అందుబాటులో ఉన్న వనరులు, వసతులతో సమాజహిత పరిశోధనలను తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఈ సదస్సులో హైదరాబాద్ సిమెట్ పూర్వపు సంచాలకులు ఆచార్య ఎన్ఆర్ మునిరత్నం మాట్లాడుతూ.. తక్కువ ఖర్చు, దేశీయ టెక్నాలజీతో సమాజానికి ఉపయోగపడే ఎన్నో అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. భారతదేశంలో 120కిపైగా యూనికార్న్ కంపెనీలు, స్టార్టప్‌లు ఉన్నాయన్నారు. ప్రాజెక్టు తయారీ ప్రారంభంలో యువ పరిశోధకులు పరిశోధనపై స్పాట్ ఎనాలిసిస్ చేయాలని సూచించారు. హైదరాబాద్ ఎన్‌జీఆర్‌ఐ ప్రిన్సిపాల్, శాస్త్రవేత్త డాక్టర్ సింథల్‌కుమార్ మాట్లాడుతూ.. ఖగోళ విజ్ఞానంపై ఎన్నో నూతన అంశాలు ముడిపడి ఉన్నాయని తెలిపారు. అనంతరం కేయూ రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం, సైన్స్ డీన్ ఆచార్య హనుమంతు, ఈ సదస్సు కోఆర్డినేటర్ ఆచార్య వెంకట్రామ్‌రెడ్డి, యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య మనోహర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మమత, గణితశాస్త్ర విభాగం అధిపతి భారవిశర్మ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వల్లాల పృథ్వీరాజ్ మాట్లాడారు. అంతకుముందు వీసీ, రిజిస్ట్రార్, అతిథులు సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇటీవల నిర్వహించిన వ్యాసరచన, వకృత్వ పోటీ, క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

# ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలి

- ఆర్టీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ వెంకన్న



సమావేశంలో మాట్లాడుతున్న ఈదురు వెంకన్న

హన్మకొండ: ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని ఆర్టీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఈదురు వెంకన్న డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆర్టీసీ జేఏసీ వరంగల్ రీజియన్ సమ్మె సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వెంకన్న ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనకు సమ్మెకు వెళ్లాల్సిన పరిస్థితులు ప్రభుత్వమే కల్పిస్తుందన్నారు. ఉద్యోగులు సమ్మెకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అదే విధంగా కార్మిక యూనియన్లను పునరుద్ధరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం కొనుగోలు చేయాలని, వేతన సవరణ చేయాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమ్మెనోటీసు ఇచ్చినా.. ఎమ్మెల్సీ ఎన్నికలకోడ్ ఉందని యాజమాన్యం చర్చలకు రాలేదని, అయితే ఎండీ వీ.సీ సజ్జనార్ మాత్రం ఔట్ సోర్సింగ్ డ్రైవర్ల నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. నియామకాలు రెగ్యులర్ ప్రాతిపదికన చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆర్టీసీ జేఏసీ రాష్ట్ర వైస్‌చైర్మన్ థామస్‌రెడ్డి, కన్వీనర్ మౌలానా, కో కన్వీనర్ యాదయ్య, శ్రీనివాస్, యాకస్వామి, పాణి, కృష్ణ, స్వామి, ఎల్లయ్య, రవీందర్, కుమార్, రవీందర్, శ్రీనివాస్, మురళి పాల్గొన్నారు.

### ప్రిన్సిపాల్ వేధిస్తున్నాడని..

- మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్ నిరసన
- ఎల్‌బీ కళాశాలలో ఘటన



నిరసన తెలుపుతున్న రాధ

రామన్నపేట: నగరంలోని ములుగు రోడ్డు సమీపంలోని లాల్ బహదూర్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసాద్ తనను వేధింపులకు గురిచేస్తున్నాడని ఆరోపిస్తూ అదే కళాశాలలోని మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్ రాధ శుక్రవారం కళాశాల భవనం ఎదుట నిరసన తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల కళాశాలలో జరిగిన టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇండిపెండెంట్ అభ్యర్థి గాలి హర్షవర్ధన్‌రెడ్డిని టీచర్ల సమస్యలపై ప్రశ్నించినందుకు కళాశాల యాజమాన్యం తనను వేధిస్తున్నట్లు పేర్కొన్నారు. టీచర్ల సమస్యలు తీర్చాలని అడిగినందుకు తనకు కళాశాల యాజమాన్యం నోటీసులు ఇవ్వగా తీసుకోకపోవడంతో, కళాశాల నుంచి వెళ్లిపోవాలని ప్రిన్సిపాల్ హుకుం జారీ చేశారని తెలిపారు. ఏడు సంవత్సరాలుగా కళాశాలలో ఫిలాసఫీ సబ్జెక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నానని, ఉస్మానియా గ్రాడ్యుయేట్ అసోసియేషన్ సొసైటీ కింద నడుస్తున్న కళాశాలలో ప్రిన్సిపాల్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కళాశాలలో పలు అభివృద్ధి కార్యక్రమాల పేరిట ప్రిన్సిపాల్ నిధులు దుర్వినియోగం చేస్తున్నారని, కళాశాలలో అధ్యాపకులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రిన్సిపాల్‌కి భయపడి ఎవరూ బయటికి చెప్పుకోవడంలేదని వివరించారు. కళాశాలలో జరుగుతున్న అన్యాయాలపై ఉస్మానియా గ్రాడ్యుయేట్ అసోసియేషన్ సొసైటీ దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

# దొంగలను పట్టించిన రెడ్ స్టార్..!

- నలుగురు నిందితుల అరెస్ట్..
- 10 బ్యాటరీలు, ఆటో స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్సై గోవర్ధన్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై గోవర్ధన్

నల్లబెల్లి: జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్న వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే వారు ప్రయాణించిన ఆటో వెనుకాల ఉన్న రెడ్ స్టార్ గుర్తు వారిని పట్టించడం గమనార్హం. వరంగల్ జిల్లా నల్లబెల్లి ఎస్సై గోవర్ధన్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో వెల్లడించిన వివరాల ప్రకారం.. ఇటీవల నల్లబెల్లి రాజరాజేశ్వర దేవాలయం సమీపంలో సోలార్ ఎల్ఈడీ వీధిలైట్లకు సంబంధించిన బ్యాటరీని గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయంలో దొంగిలించుకుని వెళ్లారు. నిందితులు వినియోగించిన ఆటో వెనక భాగంలో ఉన్న రెడ్ స్టార్, నిందితుల ఆకారం, రంగు తదితర వివరాలను ఓ వ్యక్తి పోలీసులకు విశ్వసనీయంగా అందించారు. ఈ ఆధారాల మేరకు కేసు విచారణ చేస్తున్న క్రమంలో మండలంలోని నల్లబెల్లి క్రాస్ రోడ్డులోని జాతీయ రహదారిపై శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో ఓ ఆటో మల్లంపల్లి వైపు వెళ్తుండగా.. పోలీసులు అనుమానంతో ఆటోను ఆపేందుకు ప్రయత్నించారు. దీంతో అందులోని వ్యక్తులు ఆటోను రోడ్డుపై వదిలి పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. వారిని విచారించగా.. పర్వతగిరి మండలం బంధం తండాకు చెందిన ఆటో డ్రైవర్ యాకోబు, కొంకపాకకు చెందిన అల్లాడి దుర్గ స్వామి, సంగెం మండలం తీగరాజుపల్లికి చెందిన కర్నె అభిలాష్, గూడూరు అరవింద్.. జల్సాలకు అలవాటుపడి నల్లబెల్లి, నర్సంపేట, దుగ్గొండి మండలాల్లో బ్యాటరీలు దొంగిలించినట్లు తేలిందని తెలిపారు. వారి నుంచి ఆటోతోపాటు 10 బ్యాటరీలను స్వాధీనం చేసుకొని నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుల్ సాయిలు, కానిస్టేబుళ్లు బాలు, వేణు, శ్రవణ్, పూర్ణ, హోంగార్డు రవీందర్ ఉన్నారు.

# ప్రాణంతీసిన 'కుక్క పంచాయితీ'

- ఎదురింటి వాళ్లు కొట్టారని వ్యక్తి ఆత్మహత్య



మల్లయ్య (ఫైల్)

దంతాలపల్లి: కుక్క పంచాయితీ చివరికి ఓ ప్రాణం తీసింది. పెంపుడు కుక్క విషయంలో ఎదిరింటి వాళ్లు కొట్టారని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం బొడ్లాడలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మేకల మల్లయ్య(50) ఇంటిలోకి తన ఎదురింటి వాళ్ల పెంపుడు కుక్క గ్రామంలో చనిపోయిన కోళ్లను తీసుకువచ్చి తింటుండడంతో మీ కుక్కను మీ ఇంట్లోనే కట్టేసుకోండి. చనిపోయిన కోళ్లను మా ఇంటి ముందు వేయడం వల్ల దుర్వాసన వస్తుంది' అని గురువారం సాయంత్రం చెప్పాడు. ఈ విషయంలో ఎదిరింటి వాళ్లకు, మల్లయ్య జరిగిన గొడవ తారాస్థాయికి చేరింది. ఈ క్రమంలో మల్లయ్యను ఎదిరింటి వాళ్లు కొట్టారు. దీంతో మనస్తాపానికి గురైన మల్లయ్య రాత్రి ఇంటి నుంచి వెళ్లి గ్రామశివారు చర్చి వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య పద్మ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ హ్యాండ్‌బాల్ కేయూ జట్టు

కేయూ క్యాంపస్: తమిళనాడులోని పెరియార్ యూనివర్సిటీలో ఫిబ్రవరి 28 నుంచి మార్చి 4వ తేదీ వరకు జరగబోతున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ హ్యాండ్‌బాల్ టోర్నమెంట్‌కు కేయూ జట్టును ఎంపిక చేసినట్లు శుక్రవారం కాకతీయ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వెంకయ్య తెలిపారు. ఈ జట్టులో టింకులాల్, సాయికుమార్, శ్రీరామ్, కార్తిక్, శివాజీ, రామారావు, రవికిరణ్, నివాస్, మహ్మద్ గౌస్‌పాషా, శ్రీనివాస్, వినేష్, సాయికృష్ణ, అరవింద్, సంతోష్, రోహిత్, వెంకటేష్ ఉన్నారు. ఈజట్టుకు కోచ్ కమ్ మేనేజర్‌గా నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ రమేష్ వ్యవహరిస్తున్నారని వెంకయ్య తెలిపారు.